నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా : యుటిఎఫ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై మంగళవారం నాడు అనంతపురం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్యలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందన్నారు. ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పిఎఫ్, ఎపిజిఎల్ఐ, డిఏ అరియర్స్, సరెండర్ లీవ్‌లు, గ్రాట్యూటీ, కమ్యూటేషన్ బకాయిలను వెంటనే ఇవ్వాలన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఉపాధ్యాయులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పర్యాటకానికి ప్రోత్సాహం.. అందేనా..?

గుత్తి కోట ప్రాంతం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనేక పర్యాటక ప్రాంతాలున్నాయి. దేశ, విదేశాల నుంచి కూడా జిల్లాకు పర్యాటకులు అధికంగా వస్తుంటారు. కాగ కోవిడ్ నుంచి పర్యాటక రంగం పూర్తిగా కుదేలైంది. గతేడాది నుంచి తిరిగి పర్యాటక రంగం కొంత కొలుకుంటూ ఉంది. వస్తున్న సందర్శకుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పుట్టపర్తి, పెనుకొండ, గుత్తి, హేమావతి, తిమ్మమ్మమర్రిమాను ఇలా అనేక పర్యాటక ప్రాంతాలున్నాయి. ఏటా సుమారు ఐదు లక్షల మంది వరకు జిల్లాకు పర్యాటకులు వస్తున్నట్టు రికార్డులు చెబుతున్నాయి. ఇందుకు తగ్గట్టు ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెనుకొండ కొండపైకి రహదారి, అక్కడ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం నిర్మాణం చేపడతామని గతంలో ప్రకటించారు. అయితే అది ఇంత వరకు ఆచరణకు నోచుకోలేని పరిస్థితులున్నాయి. లేపాక్షిలోనూ మౌలిక సదుపాయల కల్పన మరింత మెరుగుపరచాల్సి ఉందని స్థానికులు కోరుతున్నారు. వచ్చే పర్యాటకులకు కనీస సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. పుట్టపర్తిని అంతర్జాతీయ ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతామని గత ప్రభుత్వ హామీనిచ్చింది. అయితే చిత్రావతి నదిలో బోటు షికారు మినహా తక్కిన చర్యలేవి తీసుకున్న దాఖలాల్లేవు. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డుల్లో ఎక్కిన అతిపెద్ద మర్రి చెట్టు అయిన తిమ్మమ్మ మర్రిమాను పూర్తి స్థాయి రక్షణ చర్యలేవి లేవు. ఒకవైపు కొమ్మలు పడిపోతున్నాయి. మరోవైపు అక్కడికొచ్చే భక్తులకు కనీస సౌకర్యాలూ లేవు. కర్నాటక తదితర సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడికి పెద్దఎత్తునే తరలివస్తుంటారు. వీటిని మెరుగుపరచాల్సి అవసరముంది. అనంతపురం జిల్లాలో గుత్తి కోటలో గుప్త నిధుల తవ్వకాలు జరుగుతున్నాయి. వీటిని నిలువరించే చర్యల్లేవు.

◆ ఆగిన లేపాక్షి, పెనుకొండ ఉత్సవాలు
◆ నేడు పర్యాటక శాఖ మంత్రి రోజా రాక

నేడు పర్యాటకశాఖ మంత్రి జిల్లా పర్యటన

పర్యాటక శాఖ మంత్రి రోజా నేడు సత్యసాయి జిల్లాలో పర్యటించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు లేపాక్షికి చేరుకుంటారు. లేపాక్షి సందర్శన అనంతరం రోడ్డు మార్గంలో పుట్టపర్తికి చేరుకుంటారు. అక్కడ సాయంత్రం 7.30 గంటలకు హిల్ వ్యూ స్టేడియంలో విద్యుత్‌దీపాలు, సౌండ్‌షోను ప్రారంభిస్తారు. అనంతరం యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ హరీష్ యాదవ్ ఇంట్లో భోజనం చేసుకుని తిరిగి రాత్రి 9.30 గంటలకు రైలులో హైదరాబాద్ బయలుదేరి వెలుతారు.

అటకెక్కిన లేపాక్షి, శ్రీకృష్ణదేవరాయ ఉత్సవాలు

జిల్లాలో 2010 నుంచి జిల్లాలో శ్రీ కృష్ణదేవరాయ ఉత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఉత్సవాల నిర్వహణ ద్వారా ఈ ప్రాంతంలోని ప్రాచీన చరిత్రను తెలియజేసే ప్రయత్నం జరుగుతూ వచ్చింది. ఆ తరువాత లేపాక్షి ఉత్సవాలను నిర్వహించారు. అయితే గడిచిన మూడేళ్లుగా ఈఉత్సవాల నిర్వహణ ఆగిపోయాయి.

రైతు,కూలీలను పట్టించుకోని ప్రభుత్వం

◆ పేదలందరికీ భూములు పంచాలి ◆ వ్యకాసం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు ◆ వజ్రకరూరులో విజయవంతంగా వ్యకాసం జిల్లా మహాసభలు

జిల్లా మహాసభల్లో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి-వజ్రకరూరు

రాష్ట్రంలో నిరుపేద రైతు, కూలీలకు సాగు భూములు ఇవ్వాలని కోరుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితుల్లో లేదని వ్యకాసం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు పేర్కొన్నారు. సోమవారం నాడు వజ్రకరూరు మండల కేంద్రంలో గువ్వల నారాయణ నగర్‌లో వ్యవసాయ కార్మిక సంఘం 7వ జిల్లా మహాసభలను నిర్వహించారు. ముందుగా ర్యాలీ చేసి, గాంధీ సర్కిల్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు హాజరై మాట్లాడారు. వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల్లో వ్యవసాయ కార్మికులకు భూమి పంపిణీ చేసేలా దస్ రత్నాలు అమలు చేయాలని ఉపాధి హామీ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ పథకం చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి 200 రోజులు పనులు కల్పించాలన్నారు. వ్యవసాయ కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు రోజుకు రూ.600 పెంచాలన్నారు. కనీస వేతన చట్టం అమలు చేసి జోన్‌ల వారీగా కూలీ రేట్ల వివరాలు గ్రామ సచివాలయాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వ్యకాసం జిల్లా గౌరవాధ్యక్షులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతి రేషన్ కార్డుకు 14 రకాల నిత్యావసర సరుకులు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఉపాధి కోసం వలస వెళ్లే క్రమంలో రోడ్డు, విద్యుత్ ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. జిల్లాలో అనేక సంఘటనల్లో కార్మికులు మృతి చెందారన్నారు. ప్రభుత్వం తక్షణమే కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. జిల్లా కార్యదర్శి క్రిష్ణమూర్తి మాట్లాడుతూ వలస కార్మికులకు వలసలు నివారించి స్థానికంగానే పనులు కల్పించాలన్నారు. ప్రమాదాల్లో మృతిచెందిన కార్మికులకు 5 ఎకరాలు సాగు భూమి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సూరి, సహాయ కార్యదర్శులు భాస్కర్, సోమశేఖర్, జిల్లా నాయకులు క్రిష్ణనారాయణ, మాదన్న, మున్ని, చిదంబరమ్మ, రేణుకమ్మ, మల్లికార్జున, భాస్కర్‌రెడ్డి, మల్లేష్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటింటి సర్వే

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీసీ హాలులో వివిధ అంశాలపై కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్పందన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య, విద్యా సూచీలు పక్కాగా నమోదు చేయాలన్నారు. గర్భిణులు రక్తహీనత, పాఠశాల, కళాశాల విద్యార్థుల డ్రాప్‌అవుట్ రేట్ల వివరాలు వాస్తవ పరిస్థితికి అద్దం పట్టేలా ఉండాలన్నారు. సర్వేలో నమోదు చేసే అంశాలపై వాలంటీర్లకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు మధ్యాహ్న వేళల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తున్నట్టు ఫిర్యాదులు అందుతున్నా యన్నారు. అందుకు తగ్గట్టే సాయంత్రం బయోమెట్రిక్ హాజరు శాతం గణనీయంగా తక్కువగా ఉంటోందన్నారు. మునిసిపల్ అధికారులు, ఎంపీడీవోలు, స్పెషల్ ఆఫీసర్లు సాయంత్రం వేళల్లో విరివిగా తనిఖీలు చేసి సచివాలయంలో అందుబాటులో లేని కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' పనులు వంద శాతం గ్రౌండింగ్ చేయాలన్నారు. ఇప్పటికే గ్రౌండింగ్ చేసిన పనులకు త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్ నెస్ సెంటర్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, ఆంసెట్ సీఈవో కేశవ నాయుడు, సీపీవో ప్రేమ్‌చంద్, వ్యవసాయ శాఖ జేడీ కేశవనాయుడు, పంచాయతీ రాజ్ ఎస్ఇ భాగ్యరాజ్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

అర్జీ ఇచ్చిన ఫోటో పెడితే ఎలా..? : కలెక్టర్

'ఫిర్యాదుదారులు సమస్యలు పరిష్కరించాలని పదేపదే కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు. సమస్యలు పరిష్కరించి ఫిర్యాదుదారులు సంతృప్తి వ్యక్తపరుస్తూ ఉన్న ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలని చెప్పాం. ఇందుకు విరుద్ధంగా జిల్లా స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో దరఖాస్తు చేస్తున్నప్పుడు తీసిన ఫొటోలే అప్‌లోడ్ చేస్తే ఎలా'.? అంటూ కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధిత ఫిర్యాదుదారుల నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. మునుపటి స్పందనలో వచ్చిన అర్జీదారులే మళ్లీ వచ్చి ఫిర్యాదులు చేయడంతో కలెక్టర్ వెంటనే ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. అర్జీలు చివరి నిమిషం వరకు పెండింగ్‌లో ఉంచుకోవడం సరికాదన్నారు. దీనిపై జిల్లా అధికారులు, ఆర్‌డిఓలు, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కోర్టు, వివిధ కమిషన్లకు సంబంధించిన కేసుల్లో సకాలంలో కౌంటర్లు దాఖలు చేయడం లేదన్నారు. సంబంధిత జిల్లా అధికారులు కోర్టు కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిర్దేశిత గడువు లోపలే నివేదికలను సమర్పించడం, కౌంటర్లను దాఖలు చేయడం చేయాలన్నారు.

జగనన్నతోనే మహిళాభ్యున్నతి సాధ్యం

మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గంలో బుట్టలు అల్లుతున్న విధానాన్ని పరిశీలిస్తునన ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

సిఎం జగన్ సంక్షేమ పథకాల అమలులో మహిళలకు పెద్దపీట వేస్తున్నారని మంత్రి చరణ్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళల కోసమే ప్రత్యేకంగా పథకాలు అమలు చేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఇందులో భాగంగానే ఆసరా, వైఎస్ఆర్ చేయూత, గృహ నిర్మాణ పథకం, అమ్మఒడి, పొదుపు సంఘం సున్నా వడ్డీ, వృద్ధాప్య పింఛన్ వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, కౌన్సిలర్ ఎరుకుల తిప్పమ్మ, రామాంజనేయులు, తిరుమల, వెంకటేశులు, కౌన్సిలర్లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

కుందుర్పి : సిఎం జగన్ తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారానే గ్రామ స్వరాజ్యం సాధ్యమని మంత్రి కె.వి ఉషశ్రీచరణ్ అన్నారు. సోమవారం మండలంలోని జంబుగుంపల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సచివాలయాల ద్వారా ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా నేరుగా ప్రజలకే సంక్షేమ పథకాలు అందే విధంగా చేశారన్నారు. అవినీతి రహితంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గంగాధర, ఎంపిపి కమల నాగరాజు, జడ్పిటిసి రాధాస్వామి, కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, మాజీ ఎంపిటిసి తిప్పేస్వామి, డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు రాము, నాయకులు పాలాక్షి, మహేంద్ర, ఓబుళపతి, మాజీ సర్పంచ్ అనుమప్ప, గంటి గంగాధర, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జల వనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణనాయక్

కాలువల మరమ్మతులు చేపట్టాకే సాగునీరు విడుదల చేయాలి

బిటిపి ఆయకట్టు రైతుల సమావేశంలో నిర్ణయం

ప్రజాశక్తి-రాయదుర్గం

భైరవానితిప్ప రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువలు, ఉపకాలువల మరమ్మతులు పూర్తయ్యాకే ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయాలని ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక బిటిపి వద్ద ఆయకట్టు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జల వనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణనాయక్ మాట్లాడుతూ డిసెంబర్ 5న రబీ పంటకు కుడి, ఎడమ కాలువల కింద 7,330 ఎకరాలకు సాగునీరు విడుదల చేస్తామన్నారు. ఎడమ కాలువ కింద 1వ తూము నుంచి 14వ తూము వరకు 5,430 ఎకరాల ఆయకట్టుకు, కుడికాలువ కింద ఆర్.బి తూము నుంచి చివరి భూముల వరకు 1,900 ఎకరాలకు నీరు విడుదల చేస్తామన్నారు. అలాగే డిసెంబర్ 5వతేదీలోగా కాలులకు మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. ఇందులు రైతులు స్పందిస్తూ మొదట కాలువల మరమ్మతులు పూర్తి చేశాకే నీరు విడుదల చేయాలని కోరారు. సమావేశంలో చేసిన తీర్మానాలు, నిర్ణయాలను ఉన్నతాధికారులు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటరమణ, గుమ్మగట్ట జడ్పిటిసి మహేష్, ఎంపిపి భవానీ, వైసిపి మండల కన్వీనర్ మంజునాథ, బ్రహ్మసముద్రం మండల కన్వీనర్ బసవరాజు, బ్రహ్మసముద్రం సింగిల్‌విండో అధ్యక్షులు రామాంజనేయులు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలపై చర్యకు వినతి

కళ్యాణదుర్గం : అనుమతులు లేని ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జైభీమ్ సంరక్షణ సమితి, దళిత జన జాగతి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎంఇఒ విజయలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీచైతన్య, నారాయణ పాఠశాలల్లో 9, 10వ తరగతులకు అనుమతులు లేకున్నా కొనసాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా స్పందించి అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు చూపాలని ధర్నా



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగజ్యోతికి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

కుందుర్పి : ఇళ్ల స్థలాలు చూపాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని శీగలపల్లి, బసాపురం, తూముకుంట గ్రామాల ప్రజలు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని దళితులకు గత కొన్నేళ్ల క్రితం ఇల్లు పట్టాలు మంజూరు చేశారన్నారు. అయితే భూమి మాత్రం చూపలేదన్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి దళితులకు ఇళ్ల స్థలాలు చూపాలని డిమాండ్ చేశారు. ఇందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగజ్యోతి స్పందిస్తూ వారం రోజుల్లో సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. వారం, పదిరోజుల్లో సమస్య పరిష్కరించకపోతే తహశీల్దార్ కార్యాలయం ముందు ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాకే గురుమూర్తి, తాలూకా ఉపాధ్యక్షులు వెంకటేష్, తాలూకా ప్రధాన కార్యదర్శి పాలవై రాజు, కుందుర్పి మండల అధ్యక్షుడు బాబు, ఉపాధ్యక్షుడు మారుతి, బ్రహ్మసముద్రం ఇన్‌ఛార్జి వాసు, శెట్టూరు మండల ఇన్‌ఛార్జి రామన్న, మండల ప్రధాన కార్యదర్శి మారెప్ప, మండల అధికారి ప్రతినిధి రామాంజనేయులు, తూమకుంట నాగరాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని వినతి

రాయదుర్గం : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను ఎపిపిఎస్‌పి ద్వారా వెంటనే భర్తీ చేయాలని తెలుగు యువత నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మారుతికి తెలుగు యువత నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో దీర్ఘకాలంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించినప్పటికీ ఇంతవరకు భర్తీ చేయలేదన్నారు. 2023 జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధికి ఆర్థికసాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాయదుర్గం నియోజకవర్గ అధ్యక్షులు కురుబ రమేష్, తెలుగు నాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ అధ్యక్షులు అగ్రహారం కిరణ్ కుమార్, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి, మండల అధ్యక్షులు బసవరాజు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

భైరవానితిప్ప జలాశయంలో చేప పిల్లలను వదులుతున్న విప్ కాపు, మత్స్యశాఖ అధికారి లక్ష్మీనారాయణ

మత్స్యకారుల జీవనోపాధికి కృషి

విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం : మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా 3.36 లక్షల చేప పిల్లలను మత్స్యశాఖ అధికారి లక్ష్మీనారాయణతో కలిసి సోమవారం భైరవానితిప్ప రిజర్వాయర్‌లోకి వదిలారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ముఖ్యంగా వారి సమస్యలు పరిష్కరించడంతోపాటు అభ్యున్నతికి చేయూతనందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తాళ్లకెర సర్పంచ్ జయమ్మ, మత్స్యకారులు పాల్గొన్నారు.

ఇళ్లలోకి నీరు రాకుండా చర్యలు తీసుకోండి

రాయదుర్గం : గుమ్మగట్ట మండలం గోనబావి గ్రామం వద్ద ఉన్న చెరువు నీరు ఇళ్లల్లోకి రాకుండా చర్యలు తీఉకోవాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ డివిజన్ కార్యదర్శి ఎస్‌వి ఆంజనేయులు కోరారు. ఈమేరకు సోమవారం గుమ్మగట్టలో తహశీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు కొల్లారప్ప, మల్లికార్జున, మారప్ప, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

బకాయివేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి

కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు, స్వీపర్లు, వాచ్‌మెన్లు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పురపాలక సంఘంలోని పాఠశాలల్లో పనిచేసే స్వీపర్లు, వాచ్‌మెన్లకు బకాయి వేతనాలు చెల్లించాలని సిఐటియు నాయకులు బి.మల్లికార్జున, సిఐటియు అనుబంధ సంస్థ ఎపి మున్సిపల్ స్వీపర్స్ అండ్ వాడ్‌మెన్ల అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు కలెక్టర్ నాగలక్ష్మికి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయదుర్గం పురపాలక సంఘంలో పాఠశాలల్లో 45 మంది వాచ్‌మెన్లు, స్వీపర్లు పని చేస్తున్నారన్నారు. వారందరికీ పాతికేళ్లుగా పురపాలక సంఘం వేతనాలు చెల్లిస్తోందన్నారు. అయితే నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదన్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా వాచ్‌మెన్లు, స్వీపర్లను జిల్లా పరిషత్‌కు బదిలీ చేశారని, కావున వేతనాలు తాము చెల్లించలేమన్నారన్నారు. అలాగే సమస్యను మండల విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లగా ఇప్పటివరకు తమకు వేతనాలు చెల్లించాలని ఎలాంటి ఉత్తర్వులు రాలేదన్నారు. దీంతో వేతనాల చెల్లింపుపై గందరగోళం నెలకొందన్నారు. కావున మీరైనా స్పందించి ప్రతినెలా సక్రమంగా వేతనాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అనుబంధ సంస్థ ఎపి మున్సిపల్ స్వీపర్స్ అండ్ వాడ్‌మెన్ల అసోసియేషన్ ప్రతినిధులు శంకర్‌రావు, రామాంజి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే చేనేతలకు రాజకీయ గుర్తింపు

అఖిల భారత కుర్ని సమాజం ఉపాధ్యక్షులు బన్నీ మురుగప్ప

ప్రజాశక్తి-రాయదుర్గం

ఐకమత్యంతోనే చేనేత సామాజికవర్గం రాజకీయంగా ఎదుగుదల సాధ్యమని అఖిల భారత కుర్ని సమాజం ఉపాధ్యక్షులు బన్నీ మురుగప్ప తెలిపారు. కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా పట్టణంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేతలు సమాజంలో 20 శాతం జనాభా ఉన్నప్పటికీ రాజకీయంగా ఎదగలేదన్నారు. అనైక్యతే ఇందుకు కారణమన్నారు. కర్ణాటక రాష్ట్రంలో 8 చేనేత కులాలు ఐక్యంగా ఉండటం వల్ల అక్కడ రాజకీయంగా చేనేతలకు కొంతవరకు గుర్తింపు ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్లో కూడా చేనేత కులాలు ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు మహాదేవ, తొగట వీర క్షత్రియ సంఘం రాయదుర్గం తాలూకా అధ్యక్షులు మద్దిలేటి ప్రభాకర్, కుర్ని సంఘం అధ్యక్షులు చెన్నవీరప్ప, పద్మశాలి సంఘం రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు జింక వసుంధర, మున్సిపల్ వార్డు సభ్యులు గోవిందరాజులు, డి.హీరేహాల్ కుర్ని సమాజం అధ్యక్షులు ప్రహల్లాద, కుర్ని సంఘం ప్రతినిధులు చేనేతలు పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న ఎస్‌డిజి సర్వేను విద్యా, సంక్షేమ కార్యదర్శులు పగడ్బందీగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ బివి.నరసారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విద్య సంక్షేమ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్, హాస్టల్ సౌకర్యాలపై పక్కాగా నివేదికను తయారు చేయాలన్నారు. ఆరోగ్య, విద్య కార్యదర్శులు, మహిళా పోలీసుల సహకారంతో కార్యక్రమం చేపట్టాలన్నారు.

సర్వసభ్య సమావేశం

పుట్లూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాఘవరెడ్డి అధ్యక్షతన సర్వసభ సమావేశం సోమవారం నిర్వహించారు. సర్పంచి మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. కులము, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరుకు దాదాపు 20 రోజులు పడుతోందన్నారు. ఈలోపు అర్హులకు సంక్షేమ పథకాలు అందకుండా పోతున్నాయని తెలిపారు. స్పందించిన తహశీల్దారు సుమతి ఒకరిద్దరి సిబ్బంది వల్ల ఆలస్యం అయివుండొచ్చని.. తొందరగా మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కరెంటు సమస్యపై సమావేశంలో చర్చించుకోవడమే తప్ప పరిష్కారం కావడంలేదని పలువురు సర్పంచులు ఏఈ విజయుడిని ప్రశ్నించారు. ఎంపీపీ రాఘవరెడ్డి మాట్లాడుతూ మళ్లీ వచ్చే సమావేశంలోపు సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో యోగానందరెడ్డి, తహశీల్దార్ సుమతి ఈవోఆర్‌డీ ఆనందప్రసాద్, ఇంజినీరు ఎలమనాయుడు, ఎంఈవో శ్రీదేవి, ఏవో కాత్యాయని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యకాసం జిల్లా అధ్యక్షుడిగా సూరి

పుట్లూరు : వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా కడవకల్లు గ్రామానికి చెందిన ఎస్.సూరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండవసారి ఆయన జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక కావడంపట్ల సిపిఎం, అనుబంధ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు అభినందనలు తెలియజేశారు.

అంగన్‌వాడీల సమావేశం

పెద్దపప్పూరు : చిన్నపప్పూరు గ్రామ సమీపంలో అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ దస్తగిరమ్మ మాట్లాడుతూ.. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. ఎప్పటికప్పుడు రికార్డులను అధికారులకు పంపాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

24న విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

అనంతపురం : ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన అనంతపురం జిల్లా కేంద్రంలోని విద్యుత్ నగర్ సర్కిల్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

భక్తులతో 'అశ్వర్థం' కిటకిట

పెద్దపప్పూరు : కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో చిన్నపప్పూరు గ్రామ సమీపంలోని అశ్వర్థనారాయణ స్వామి, భవానీ భీమలింగేశ్వర స్వామి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ అధికారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నదానం చేశారు.

నేడు నార్పల సర్వసభ్య సమావేశం

నార్పల : నార్పల ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దివాకర్ తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు. అధికారులు వారి శాఖల ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. గైర్హాజరు అయితే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వికలాంగుల సర్టిఫికెట్ల పరిశీలన

పెద్దపప్పూరు : ముచ్చుకోట గ్రామ సచివాలయంలో వికలాంగుల సర్టిఫికెట్లను ఎంపిడిఒ రామకృష్ణ సోమవారం పరిశీలించారు. వికలాంగులకు పింఛన్లు మంజూరు సందర్భంగా వారికి వికలాంగత్వం శాతం ఎంత ఉందో తెలుసుకునేందుకు సర్టిఫికెట్లను పరిశీలించారు. అనంతరం ఆయన గ్రామంలో ప్రభుత్వ నూతన నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఋణ వసూలు అప్పీలేట్ ట్రిబునల్, కలకత్తా
అప్పీలు నెంబర్ 255 ఆఫ్ 2018
(ఛాలెంజింగ్ ద ఆర్డర్ ఇన్ సెక్యూరిటైజేషన్ అప్లికేషన్ నెంబర్ 12 ఆఫ్ 2017
(new SA No. 659 of 2017)
కే.చిరంజీవి రెడ్డి మరియు ఇతరులు
.... అప్పిల్లంట్
మరియు
శ్రీ కె.జయప్రకాష్ రెడ్డి మరియు ఇతరులు
.... రెస్పాండెంట్
TO
రెస్పాండెంట్ నెం 1
శ్రీ కె. జయప్రకాష్ రెడ్డి, తండ్రి శ్రీ కె. వి.కొండారెడ్డి
నివాసం : ఇంటి నెం. 12-639,
జీసస్ నగర్, అనంత పూర్, ఆంధ్రప్రదేశ్.
ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా, మా క్లయింట్ అయిన శ్రీ చిరంజీవి రెడ్డి గారు, మీకు వ్యతిరేకముగా అప్పీలు నెం. 255 ఆఫ్ 2018 ను, ఋణ వసూలు అప్పీలేట్ ట్రిబునల్, కలకత్తా నందు ఫైల్ చేయటం జరిగినది సదరు అప్పీలు 29.11.2022 నాటికి వాయిదా పడినది మరియు మీకు నోటీసులు జారీ చేయవలసినదిగా కోర్టు వారు ఆజ్ఞాపించిరి. కావున ఈ నోటీసును కేసులో మీ యొక్క హాజరు నిమిత్తము పంపటం జరుగుతుంది.
Hyderabad
Date : 21.11.2022
Sd/- REGISTRAR
Debts Recovery Appellate Tribunal
Kolkata

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నకిలీ పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు పూలు పూయని, కాయలు కాయని పత్తి మొక్కలు పట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు పత్తి పంట విస్తారంగా సాగుచేశారన్నారు. పత్తి విత్తన కంపెనీలు రైతుల బలహీనతను ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాలు అంటగట్టి నిలువు దోపిడీ చేశారని తెలిపారు. పామిడి, తాడిపత్రి, యాడికి మండలాల్లో పత్తి రైతులు అఖిర, తడాఖ తదతర కంపెనీ విత్తనాలను సాగు చేశారన్నారు. 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సిన పత్తి 2, 3 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి రావడంతో కూలీల ఖర్చులు కూడా రాని పరిస్థితి ఉందన్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయారన్నారు. పామిడి మండలం గజరాంపల్లి గ్రామంలో 1800 ఎకరాలు అఖిర, తడాఖ కంపెనీ విత్తనాలు సాగు చేశారన్నారు. రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు ఎకరాకు పెట్టుబడి పెడితే 2 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి రావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని తెలిపారు. యాడికి మండలం గుడిపాడు గ్రామంలో 300 ఎకరాలలో నకిలీ పత్తి విత్తనాలతో పంట నష్టపోయారన్నారు. అఖిర, తడాఖ పత్తి కంపెనీ యాజమాన్యం, ఫర్టిలైజర్స్ కంపెనీలపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎకరాకు రూ.50 వేలు పరిహారం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కలెక్టర్ అక్కడే ఉన్న జిల్లా వ్యవసాయ శాఖ జెడి చంద్రానాయక్‌ను సమస్యపై పరిశీలన చేసి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రైతులు మారుతిప్రసాద్‌రెడ్డి, హనుమంతరెడ్డి, రామచంద్రారెడ్డి, లక్ష్మన్న, ఆదినారాయణ, కిరణ్‌కుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కేశవరెడ్డి, మారుతి, దేవదాస్, యోగేశ్వరరెడ్డి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

శింగనమలలో ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

రాప్తాడు : అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ లక్ష్మానాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పోతులయ్య, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, గాండ్లపర్తి పోతలయ్య, నారాయణస్వామి, శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డి, వెంకటరామిరెడ్డి, సుబ్బిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఎపి రైతుసంఘం, సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఎపి రైతుసంఘం జిల్లా జిల్లా సహాయ కార్యదర్శి బి.హెచ్ రాయుడు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్‌ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వంశీ, మండల కార్యదర్శి అరవింద్, సిపిఎం నాయకులు రామంజి, రఘు, రైతుసంఘం నాయకులు వెంకటేషులు, శివప్ప, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్ : వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ బి.రాముకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి భజంత్రి శ్రీనివాసులు, సిఐటియు నాయకులు మారుతి ప్రసాద్, తిమ్మప్ప, రైతులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతులతో కలిసి తహశీల్దారు మునివేలుకు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం మండల నాయకులు రాజారాంరెడ్డి, నాయకులు చెన్నారెడ్డి, శిరీష, రైతులు వెంకటేష్, రమేష్, జయశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తహశీల్దారు ఈశ్వరమ్మకు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సుంకన్న, సభ్యులు బాషా, శ్రీనివాసులు, రమేష్, రామ్మోహన్, నాగభూషణ, తులసి, రామయ్య, జయరాం, నాగముని, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు..

పుట్లూరు : అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహశీల్దారు సుమతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజి, రైతు సంఘం మండల కార్యదర్శి వెంకట చౌదరి, రైతులు చిన్నప్పయ్య, నాగమయ్య, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి రాము, సిఐటియు మండల నాయకులు శివశంకర, జయమ్మ, రాజేశ్వరమ్మ, ఆనంద్, రాము, అనిల్, దామోదర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : భూమి కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దారుకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితుల సంఘం నాయకులు వి.శివారెడ్డి, ఆర్.కుల్లాయప్ప, పాల్ నాయుడు, రత్నమ్మ, రాజగోపాల్‌శెట్టి, నెట్టికల్లు, జయరాంరెడ్డి పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు అన్యాయం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమస్యలు పరిష్కరించాలని నిరసన చేస్తున్న వారిని ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలక్రిష్ణ, నరసింహారెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ స్టేడియంలను పే అండ్ ప్లే పేరుతో ప్రవేట్ వ్యక్తులకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) కార్యాలయం ఎదుట శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు డివైఎఫ్ఐ నాయకులు 11 మంది అక్రమంగా అరెస్టు చేయడాన్ని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ స్టేడియంలను ప్రయివేట్ వ్యక్తులకు ఇవ్వడం అంటే పేద, మధ్య తరగతి విద్యార్థులు, యువకులను క్రీడలకు దూరం చేయడమే అవుతుందదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించి వారికి అన్ని రకాల సహాయ సహకారాలు అందించాల్సింది పోయి ఉన్న అరకొర ఆట స్థలాను కూడా ప్రయివేట్ పరం చేస్తే క్రీడాకారులు పోటీలలో ఎలా రాణిస్తారని ప్రశ్నించారు. జిల్లాలో ఉన్న బ్యాడ్మింటన్, టెన్నిస్, రెజ్లింగ్, బాస్కెట్ బాల్, ఇండోర్ స్టేడియం గేమ్స్ అన్నీ లీజ్‌కి ప్రయివేట్ వ్యక్తులకు ఇచ్చేయడం సరికాదన్నారు. ఇప్పటికే విద్య ప్రయివేటీకరణ వల్ల స్కూల్‌లో విద్యార్థుల ఆటలకు ప్రాధాన్యత తగ్గిపోయిందన్నారు. కేవలం చదువు తప్ప వేరే ధ్యాస లేకుండా చేస్తున్నారని విమర్శించారు. కనీసం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు, యువకులు ఆటల పోటీలలో రాణిస్తున్నారని, ఇప్పుడు ఆ అవకాశం కూడా లేకుండా ప్రభుత్వం చేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఐక్య ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే వైవిఆర్‌కు మతి భ్రమించిదేమో..

మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్

ప్రజాశక్తి-గుంతకల్లు

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లా చేసిన పర్యటనకు వచ్చిన జన సంద్రాన్ని చూసి మతి భ్రమించి గుంతకల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి తన స్థాయిని మరచి విమర్శిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ ఎద్దేవా చేశారు. సోమవారం గుంతకల్లు పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వైసిపి మూడేళ్ల పాలనపై విసుగుతో ప్రజలు చంద్రబాబు మళ్లీ సిఎం కావాలని కోరుతూ ఆయన పర్యటనకు పోటెత్తి వస్తున్నారన్నారు. అది చూసి భయంతో మతి భ్రమించి సీఎం జగన్మోహన్‌రెడ్డి తన అనుచర గణమైన మంత్రులు, ఎమ్మెల్యేలతో దిగజారుడు వ్యాఖ్యలు చేయిస్తున్నాడన్నారు. ఇప్పుడు ఎన్నికలు జరిపినా ప్రజలు వైసిపిని భూస్థాపితం చేసి చంద్రబాబును సీఎం చేస్తారన్నారు. సిఎం పదవి కోసమే జగన్‌రెడ్డి ఒక్క ఛాన్స్ అని ప్రజల్ని నమ్మించి మోసం చేశాడన్నారు. చంద్రబాబు రాష్ట్ర భవిష్యత్తు కోసం చివరి ఛాన్స్ ఇవ్వండని అడిగితే ఆ మాటలకి కూడా వైసిపి ఎమ్మెల్యేలు వక్రభాష్యం చెబుతున్నారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే దిగజారుడు వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి ఆర్.పవన్ కుమార్ గౌడ్, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ వెంకటేసులు, మాజీ ఎంపీపీ రాయల రామయ్య, బిసిసెల్ పార్లమెంట్ ఉపాధ్యక్షులు కేశప్ప, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి జింకల జగన్నాథ్, సీనియర్ నాయకులు తలారి మస్తానప్ప, బండారు రామన్న చౌదరి, ఆటో ఖాజా, నందీశ్వర్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కురుబ సురేష్, నాయకులు గోపాల్, బూసి, రంజాన్, ఫ్రూట్ మస్తాన్, ఫజులు తదితరులు పాల్గొన్నారు.

ఐబిసిసి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

డీఎస్పీ ప్రసాద్‌రెడ్డికి విద్యార్థి జెఎసి నేతల వినతి

గ్రామీణ పేద విద్యార్థులతో కోచింగ్‌ల పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న గ్రబీజ్ కంపెనీ అనుబంధ ఇండిపెండెన్‌డెంట్ బిజినెస్ కన్సల్‌టెంట్ సెంటర్ (ఐబిసిసి) సంస్థ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి యువజన సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జెఎసి ఆధ్వర్యంలో అనంతపురం డీఎస్పీ ప్రసాద్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యచంద్ర యాదవ్, వైఎస్ఆర్ విద్యార్థి విభాగం నాయకులు హనుమంత్‌రెడ్డి, భాను ప్రకాష్‌రెడ్డి, ఆవుల రాఘవేందర్‌రెడ్డి, ఎపిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల రాఘవేంద్ర, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ.సురేష్ హాజరై మాట్లాడారు. అనంతపురం నగరంలోని కమలానగర్‌లో, సాయి టవర్స్ 3వ ఫ్లోర్‌లో ఐబిసిసి అనే సంస్థ గ్రామీణ విద్యార్థులకు 4 రోజుల పాటు శిక్షణ ఇచ్చి, శిక్షణకు వచ్చిన విద్యార్థుల నుంచి రూ.2 వేలు దరఖాస్తు ఫీజు వసూలు చేస్తున్నారని తెలిపారు. అనంతపురానికి 25 కిలోమీటర్లు దూరప్రాంతాల వారు మాత్రమే అర్హులంటూ పేద విద్యార్థులను ఈ సంస్థ టార్గెట్ చేసిందన్నారు. శిక్షణ ఇస్తామంటూ పిలిచి 4 రోజుల శిక్షణ ఇచ్చిన తరువాత విద్యార్థులను సంస్థలోనే పెట్టుకుని, అనేక అపోహలు సృష్టించి విద్యార్థులకు డబ్బు ఆశ చూపిస్తూ వారితో ఒక్కొక్కరితో రూ.45,550, 8,550 చొప్పున డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఎలాంటి బోర్డింగ్, ప్రచారం లేకుండా నోటి మాటతోనే విద్యార్థులను రాబట్టుకుంటున్నారని తెలిపారు. విద్యార్థులు మోసపోతున్నామని గ్రహించి ఎస్ఎఫ్ఐని ఆశ్రయించారన్నారు. తాము పరిశీలిస్తే అనుమానం వచ్చిందన్నారు. పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించి జరుగుతున్న మోసాలను అరికట్టి విద్యార్థులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సంజీవ్, అశోక్‌కుమార్, సందీప్‌రెడ్డి, సంపత్, అనిల్, సూరి, ఓబులేసు యాదవ్, మహేష్, అష్రాఫ్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి జెఎసి నాయకులు

సమస్యల పరిష్కార వేదికగా రచ్చబండకు శ్రీకారం

జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్

చిలకం మధుసూదన్, వరుణ్ లకు సన్మానం

అనంతపురం : జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న సంకల్పంతో, సమస్యల పరిష్కారానికి వేదికగా రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జనసేన అనంతపురం అర్బన్ ఇన్‌ఛార్జి, జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ అన్నారు. సోమవారం నగరంలోని రెండవ డివిజన్‌లో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. స్థానిక ప్రజలు తమ సమస్యలను తెలుపుకునేందుకు జనసేన నాయకుల వద్దకు వచ్చారు. రేషన్ కార్డులు, పింఛన్ల తొలగింపు, అధిక విద్యుత్ ఛార్జీలు, మౌలిక వసతుల లేమి, ఉపాధి లేక నిర్వీర్యం అవుతున్న యువత, ఇంటి వద్దకే రేషన్‌పై అసహనం, రహదారుల మరమ్మతు, డ్రైనేజీల దుస్థితి, చెత్త పన్ను తదితర సమస్యలను జనసేన అధ్యక్షుల దృష్టికి తీసుకొచ్చారు. వరుణ్ మాట్లాడుతూ..ఒక్క ఛాన్స్ అంటూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజల్ని మోసం చేశారన్నారు. మరోసారి ఆయన మాయలో పడి తప్పు చేయొద్దని.. రాజకీయాల పట్ల నీతి, నిజాయతీ, చిత్తశుద్ధి, అంకితభావం కలిగిన పవన్‌కళ్యాణ్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన చారిత్రాత్మక సందర్భాన్ని ఏ ఒక్కరూ వదులుకోవద్దన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, జనసేన కార్యకర్తలు అధ్యక్షులు టిసి వరుణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డికి గజమాలవేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రెండవ డివిజన్ ఇన్‌ఛార్జిగా రామాంజిని నియమించారు. రాష్ట్ర కార్యక్రమాల ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్, నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షులు జయరాం రెడ్డి, అంకె ఈశ్వరయ్య, ప్రాంతీయ మహిళా కమిటీ సభ్యులు పసుపులేటి పద్మావతి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పత్తి చంద్రశేఖర్, కుమ్మర నాగేంద్ర, కార్యదర్శులు కిరణ్ కుమార్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజల్లో సంతోషం

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, జనం హృదయాల్లో జగన్ చిరస్థాయిగా నిలిచిపోతారని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఇలాంటి తరుణంలో ఎలాగైనా ప్రజలను రెచ్చగొట్టి లబ్ధిపొందాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని అన్నారు. సోమవారం నగరంలోని 20, 30వ డివిజన్లలో కార్పొరేటర్లు లావణ్య, నరసింహులుతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఉదయం 20వ డివిజన్‌లో అనంతపురం ఎంపీ తలారి రంగయ్యతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సాయంత్రం 30వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం చేపట్టారు. వివిధ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధికి సంబంధించి రూపొందించిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. స్థానికంగా రోడ్లు, డ్రెయినేజీ సమస్యలపై నేరుగా ప్రజలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమాల్లో మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ ఫయాజ్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, పలువురు కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సగరుల కార్తీక వనభోజన మహోత్సవం

తాడిపత్రి రూరల్ : సగర (ఉప్పర) కుల సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం మహోత్సవాన్ని సజ్జలదిన్నె గ్రామంలో ఉన్న సాయిబాబా మందిరం నందు సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరాముడు, భగీరథ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళి లర్పించారు. సగరులను బిసి-డి నుంచి బిసి-ఎ కి మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి సగరులు నాగయ్య, పుల్లయ్య, లక్ష్మీనారాయణ, కిష్ట, ఆది తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

తాడిపత్రి రూరల్ : రైలు నుంచి జారిపడి ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన తాడిపత్రి రూరల్ పరిధిలోని రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రైల్ నెంబర్ 22157 నందు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన గులాబ్‌సింగ్ అనే వ్యక్తి ప్రయాణం చేస్తూ తాడిపత్రి రైల్వే స్టేషన్ సమీపంలో అదుపు తప్పి జారిపడ్డాడు. గులాబ్‌సింగ్ కాలుకి, తలకి తీవ్ర గాయాలయ్యాయి. అప్రమత్తమైన రైల్వే సిబ్బంది క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం తాడిపత్రి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఎరువుల దుకాణం తనిఖీ

నార్పల : నార్పల మండల కేంద్రంలోని గోకుల్ సాయి ఫర్టిలైజర్స్ దుకాణాన్ని మండల వ్యవసాయ అధికారి ముస్తఫా సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీలర్లు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలన్నారు. ప్రస్తుతం సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ధర రూ.500, 14-35-14, 28-28-0 ధర రూ.1500 లకు తగ్గించారన్నారు. డీలర్లు కొత్త ధరలకే ఎరువులు విక్రయించాలని, ధరల పట్టికలను దుకాణాల్లో ఏర్పాటు చేయాలన్నారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతి

అనంతపురం కార్పొరేషన్ : నగరపాలక సంస్థలోని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎంటిఎం.నాగరాజు, ప్రధాన కార్యదర్శి నాగభూషణం ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ సావిత్రి, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య లకు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. కార్మికులకు బకాయి వేతనాలు, హెల్త్ అలవెన్స్ చెల్లించాలని కోరారు. రెగ్యులర్ కార్మికులకు యూనిఫాం, కుట్టుకూలి, చెప్పులు, కొబ్బరి నూనె, రక్షణ పరికరాలు, పనిముట్లు వెంటనే అందించాలన్నారు. ఇఎస్ఐ కార్డుల్లో తప్పులను సవరించి అందరికీ వైద్యం అందేలా చూడాలన్నారు. ఎన్ఎంఆర్, కోవిడ్, మలేరియా, గార్బేజ్, క్లాప్ ఆటో డ్రైవర్ల బకాయి వేతనాలు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. నగర సహాయ కార్యదర్శి బత్తల ఆదినారాయణ, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సిడిపిఒ ఉమాశంకరమ్మ

శింగనమల : శింగనమల ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లోని సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని సిడిపిఒ ఉమాశంకరమ్మ హెచ్చరించారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు విధులకు గైర్హాజరు అయితే మెమోలు జారీచేస్తామన్నారు. మూడు మెమోలు ఇచ్చిన తర్వాత తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు. ఇటీవల ఒక అంగన్‌వాడీ ఆయా విధులకు గైర్హాజరు కావడంతో మెమో ఇచ్చామన్నారు. మూడు మెమోలు ఇచ్చినా సమాధానం రాకపోవడంతో తగు చర్యల నిమిత్తం పై అధికారులకు తెలియజేశామన్నారు. వారి సూచనల మేరకు షోకాస్ నోటీస్ కూడా ఇచ్చామన్నారు. విధులపట్ల నిర్లక్ష్యంవహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అత్యాధునిక జిమ్‌ను అందుబాటులోకి తెస్తాం

నగర మేయర్ మహమ్మద్ వసీం

అనంతపురం కార్పొరేషన్ : నగర ప్రజల సౌకర్యార్థం అత్యాధునిక జిమ్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని నగర మేయర్ మహమ్మద్ వసీం పేర్కొన్నారు. నగరంలోని రైతు బజార్ సమీపంలో ఉన్న నగరపాలక సంస్థ జిమ్‌ను డిప్యూటీ మేయర్లలతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న జిమ్ భవనం శిథిలావస్థకు చేరిందన్నారు. దానిని పూర్తిగా తొలగించి అత్యాధునిక భవన నిర్మాణం చేపట్టడానికి అంచనాలు తయారు చేయాలని ఎస్ఈ నాగమోహన్‌ను ఆదేశించారు. జిమ్‌లో అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేయడానికి కూడా అంచనాలు త్వరితగతిన తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇషాక్, టివి చంద్రమోహన్ రెడ్డి, డీఈ చంద్రశేఖర్, ఏఈ లు బాబావలి, సాయి తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యం కోర్సులకు శిక్షణ

పుట్లూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జల్ జీవన్ మిషన్ ప్రోగ్రాంలో భాగంగా ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, తాపీమేస్త్రీ, పంప్ ఆపరేటర్ తదితర వృత్తి నైపుణ్యం శిక్షణ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ యోగానందరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో 6 రోజులు ఉచిత భోజన వసతి సదపాయాలతో పాటు శిక్షణ ఇస్తామని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సెంట్రల్ గవర్నమెంట్ సర్టిఫికెట్‌తో పాటు, రూ.500 ఉపకారవేతనం అందజేస్తామని చెప్పారు. అర్హులు తమ దరఖాస్తులను ఈనెల 22వ తేదీలోపు naca-datp@gmail.com కు పంపాలని కోరారు.

10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ తగదు

అనంతపురం : కులాల వారీ జనగణన చేయకుండా ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్ 10 శాతం ఇవ్వడం తగదని కురుబ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ నారాయణ స్వామి, రాగే మురళి, రాగే యల్లప్ప అన్నారు. స్థానిక 13వ డివిజన్ టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని కాలదన్ని దేశ జనాభాలో 2 శాతం కూడా లేని అగ్ర వర్ణ పేదలకు బిజెపి, సుప్రీంకోర్టు 10 శాతం రిజర్వేషన్ అని అన్యాయాలకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కులాల వారీగా జనగణన చేసి అనంతరం అన్ని వర్గాల్లో ఉన్న పేదల సంఖ్యను లెక్కగట్టి ప్రతి వర్గానికి వచ్చిన శాతంలో అందులోని పేదలకు రిజర్వేషన్ కల్పించడం న్యాయమని చెప్పారు. దీనిపై ఎస్సీ, ఎస్టీ, బీసీలను కలుపుకొని న్యాయ పోరాటంతో పాటు, దేశ వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. తెలుగు యువత నాయకులు శివశంకర్, పెనికలపాటి వేణు, హరి, వీర, తేజ పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

గుంతకల్ రూరల్ : మనకి అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎపిఎం రామమూర్తి అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎన్ఆర్ఎల్ఎం పథకంలో భాగంగా డ్వాక్రా గ్రూపు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో పశు పోషణ, కుటీర పరిశ్రమలు, స్వల్పకాలిక నిలువ ఉన్న ఆహార పదార్థాల తయారీ కేంద్రాలకు 30 శాతం సబ్సిడీతో రుణాలు అందిస్తున్నాయన్నారు. ఈ అవకాశాన్ని గ్రూపు సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిసిలు రామానంద్, అనిత, ఎస్‌హెచ్‌జి సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఖోఖో జట్ల ఎంపిక

ఉరవకొండ : క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఉరవకొండ మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆమిద్యాల ప్రభుత్వ హైస్కూల్లో జిల్లాస్థాయి ఖోఖో క్రీడాకారుల జట్ల ఎంపికకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాల కార్యదర్శులు రవికుమార్, అంజన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల పరిధిలో 48 ఖోఖో క్రీడా జట్లు పోటీలలో పాల్గొన్నారన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. జిల్లా స్థాయిలో విజయాలు సాధించి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనాలని ఆకాంక్షించారు. సర్పంచి శ్రీరాములు, పాఠశాల కమిటీ ఛైర్మన్ రామాంజనేయులు, హెచ్ఎం నాగమంజుల, ఫిజికల్ డైరెక్టర్ మారుతి ప్రసాద్, వ్యాయామ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొరార్జీ యాదవ్, ఉపాధ్యక్షులు నాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంగనాథస్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతం

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన శ్రీ బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఛైర్మన్ వేల్పుల సోమశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలోని కళ్యాణకట్టపై స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఉంచే రంగనాథస్వామి, శ్రీదేవి భూదేవిలతో ఘనంగా కళ్యాణం నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఛైర్మన్ వేల్పుల సోమశేఖర యాదవ్ దంపతులకు ఆలయ అర్చకులు పార్థసారథి శాలువాలు కప్పి సన్మానం చేశారు.